సురక్షితమైన తాగునీటిని అందిస్తాం



వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి: మండల పరిధిలోని శానంభట్ల గ్రామ పంచాయతీ ప్రజల మెరుగైన ఆరోగ్యానికి సురక్షితమైన శుద్ధనీటిని అందించేందుకు ఆర్వో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. శనివారం శానంభట్ల గ్రామ పంచాయతీలో ఆర్వో వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి తుడా చైర్మన్ భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుడా నిధులు సుమారు రూ.9 లక్షల వ్యయంతో వాటర్‌ప్లాంట్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. తమను ఎంతగానో ఆదరిస్తున్న శానంభట్ల గ్రామ ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. పంచాయతీ అభివృద్ధికి కట్టుబడి ఇప్పటికే రూ.4 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తుమ్మలగుంటను మించి శానంభట్లను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. 2014, 2019 ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఆదరించిన పంచాయతీ ప్రజలు 2024లో కూడా వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆర్వో వాటర్‌ప్లాంట్‌కు స్థలాన్ని విరాళంగా అందించిన దాత నరసింహా రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ యుగంధర్ రెడ్డి, నర్సింగాపురం సింగిల్‌విండో చైర్మన్ మల్లం చంద్రమౌళి రెడ్డి, సర్పంచ్ యశోద, ఎంపీటీసీ భారతి, వెంకటముని రెడ్డి, రామభద్రారెడ్డి, వెంకటరామిరెడ్డి, మురగారెడ్డి, పృథ్వీరెడ్డి, మునిచంద్రారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాజీ ఏఎంసీ చైర్మన్ కుమారుడికి పరామర్శ



అఫ్రిద్‌ను పరామర్శిస్తున్న మోహిత్‌రెడ్డి

పాకాల: మాజీ ఏఎంసీ చైర్మన్ మునీర్ కుమారుడు అఫ్రిద్‌ను తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరామర్శించారు. శనివారం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న అఫ్రిద్‌కు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. మునీర్ తనకు అత్యంత సన్నిహితుడని, అతని కుమారుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. బాధలో ఉన్న మునీర్‌ని ఓదార్చి ధైర్యం చెప్పారు.

జనాభా విద్య ప్రాముఖ్యతపై అవగాహన

తిరుపతి సిటీ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని జనాభా విద్య విభాగం ఆధ్వర్యంలో వర్సిటీలో శనివారం జనాభా విద్య ప్రాముఖ్యత అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విక్రమ సింహపురి యూనివర్సిటీ సోషల్ వర్క్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత హాజరై ప్రసంగించారు. భారత దేశ జనాభా ప్రధాన అంశాలు యువత, వృద్ధాప్యం, స్త్రీ శిశు సంక్షేమమేనని తెలిపారు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలకు సంబంధించిన జనాభా సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సాయి సుజాత, హెడ్ డాక్టర్ చంద్రశేఖరయ్య, అకడమిక్ కన్సల్టెంట్లు, గెస్ట్ ఫ్యాకల్టీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డి పెళ్లికానుక అందజేత



పెళ్లికానుక అందజేస్తున్న నాయకులు

తిరుపతి మంగళం: చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు, డాక్టర్ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నియోజకవర్గంలో జరుగుతున్న పెళ్లిళ్లకు సొంత నిధులతో పెళ్లికానుకను అందిస్తున్నారు. అందులో భాగంగా శనివారం తిరుపతి రూరల్ మండలం మంగళం పంచాయతీ మంగళం క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ఝాన్సీశ్రీ అనే వధువుకు బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, వధూవరులకు దుస్తులు, శ్రీవారి ప్రసాదం లడ్డు వడ, గ్రీటింగ్ కార్డును మంగళం పంచాయతీ సర్పంచ్ గంగారపు వరలక్ష్మి రాంబాబు, ఉపసర్పంచ్ బైరెడ్డి రమేష్, ఎంపీటీసీ గణేష్, వార్డుమెంబర్ దయాకర్, దినేష్, గృహసారథులు సిద్ధయ్య, ఏపీఆర్‌ఓ చందు కొండారెడ్డి అందజేశారు.

వీఆర్‌ఓపై దాడి దారుణం



మాట్లాడుతున్న నాగరాజు

చంద్రగిరి: విధి నిర్వహణలో కులగణన సర్వే చేస్తున్న వీఆర్‌ఓపై దాడి చేయడం దారుణమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. రెండు రోజుల క్రితం రాయలపురం వీఆర్వో హరికృష్ణపై టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ మనోహర్, సుబ్రమణ్యం దాడి చేసిన ఘటన విధితమే. ఈ క్రమంలో శనివారం వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడు వెంకన్న నాయుడు ఆధ్వర్యంలో వీఆర్వోలు స్థానిక పోలీసు స్టేషన్‌కు చేరుకుని సీఐ రాజశేఖర్‌తో చర్చించారు. అనంతరం నాగరాజు స్టేషన్ బయట మీడియాతో మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉన్న వీఆర్‌ఓపై మాజీ సర్పంచ్ ఆయన అనుచరుడు దాడికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. వీఆర్‌ఓలపై ఇటువంటి భౌతిక దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నిందితులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మరోసారి ఇటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. జిల్లా కోశాధికారి భాస్కర్, వీఆర్‌ఓలు వాసయ్య, మునస్వామి, వెంకటేష్, దినేష్, ఇషాంత్ పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

పాకాల: మండల కేంద్రంలో ప్రైవేట్ ఎలక్ట్రిక్ కార్మికులు ఎలక్ట్రీషియన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఆ సంఘం అధ్యక్షుడు సెబాస్టియన్, ఉపాధ్యక్షుడు మునికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ థామస్ అల్వా ఎడిసన్ బల్బును కొనుగొన్న రోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి చిత్తూరు రోడ్డు వరకు ర్యాలీ మేళతాళాలతో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం సెక్రటరీ వెంకటేష్, వెంకటరామారెడ్డి, పురుషోత్తం రెడ్డి, భాస్కర్, బాలాజి, షబ్బీర్, లోకనాథ్‌సింగ్, శంకర్, కార్మికులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల బీమా సాయం అందజేత



బీమా సాయం అందజేస్తున్న మోహిత్ రెడ్డి

చంద్రగిరి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అరగొండ జగన్నాథ రెడ్డి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని శనివారం తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అందజేశారు. కుటుంబానికి అండగా ఉన్న కొడుకుని కోల్పోయామని వారు కంటతడి పెట్టుకున్నారు. ఈ సందర్భంగా వారిని మోహిత్ రెడ్డి ఓదార్చారు. ఏ అవసరం వచ్చినా మేమంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ బీమా నిరుపేదలకు ఆసరాగా నిలుస్తోందన్నారు. కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తు మృతి చెందితే ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా రూ.5 లక్షల వరకు వర్తింపజేస్తున్నట్లు వివరించారు. స్థానిక నేతలు పాల్గొన్నారు.

టీటీడీ అటవీ కార్మికులకు న్యాయం చేయండి



దీక్షకు మద్దతు తెలుపుతున్న నాయకులు

తిరుపతి(అలిపిరి): సుమారు 38 నెలలుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా, టీటీడీ అటవీ కార్మికులకు న్యాయం జరగడం లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఆధ్వర్యంలో 9 మంది అటవీ కార్మికులు శనివారం నిరవధిక నిరాహార దీక్షలు తిరుపతిలోని డీఎఫ్‌ఓ కార్యాలయం ఎదుట ప్రారంభించారు. ఈ సందర్భంగా రాయలసీమ అధ్యయనాల సంస్థ అధ్యక్షుడు భూమన్ మాట్లాడుతూ అటవీ కార్మికుల పోరాటం న్యాయమైందని, పలుమార్లు తాను ఉన్నతాధికారులతో మాట్లాడానని తెలిపారు. మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు, మాజీ శాసనమండలి చైర్మన్ విఠపు బాలసుబ్రమణ్యం, మాజీ విశ్రాంత న్యాయమూర్తి పి.గుర్రప్ప, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి, రిపబ్లికన్ పార్టీ నేత పి.అంజయ్య, జనసేన నేత కిరణ్‌రాయల్, సీపీఐ (ఎంఎల్) నేత ఆర్.హరికృష్ణ, ఆప్ పార్టీ నేత నాగేష్, బీఎస్పీ నేత విజయ్‌కుమార్ తదితరులు దీక్ష చేస్తున్న వారికి పూలమాలలు వేసి మద్దతు తెలిపారు.

కబ్జా కోరల్లో జనసేన కార్యకర్తలు



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

తిరుపతి కల్చరల్: దళితుల భూములను కబ్జా చేయడమేగాక, దాన్ని అడ్డుకునే దళితులపై జనసేన పార్టీ కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సౌత్ ఇండియా జాయింట్ సెక్రటరీ ఏ.రాజ్‌కుమార్ ఆరోపించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేణిగుంట మండలం, ఎల్లమండ్యం పంచాయతీ, మల్రిగుంట దళితవాడ గ్రామ సర్వే నం.12/2లో ఎకరా 90 సెంట్లు భూమిని 1977లో డీ పట్టా పొంది నాటి నుంచి మల్రిగుంట దళితులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అయితే గత మూడు నెలలుగా రేణిగుంట జనసేన పార్టీ కార్యకర్త మురళీమోహన్‌రాయల్ యూటూబ్ ముసుగులో తన అనుచరులతో కలిసి దళితుల భూమి ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇదే స్థలంపై నకిలీ పట్టా సృష్టించి దగా చేస్తున్నారని వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, ఎస్‌కె బాబు, ఆంజనేయులు

తిరుపతి మంగళం : డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ భవన వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నల్లాని శ్రీరాములు ప్రథమ వర్ధంతిని శనివారం వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తిరుపతి గాంధీపురంలో నిర్వహించిన నల్లాని శ్రీరాములు వర్ధంతి కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె.బాబు, కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు పాల్గొని సుమారు 500 మంది పేదలకు అన్నదానం చేశారు. నల్లాని శ్రీరాములు దళితుల సంక్షేమానికి, వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నిరంతరం శ్రమించిన గొప్ప నాయకుడని వారు కొనియాడారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ కడపగుంట అమరనాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు రాపూరి ప్రసాద్, బుడమగుంట్ల కుమార్, వెంకటేష్, ఆమోస్‌బాబు, తాళ్లూరి ప్రసాద్, చేజర్ల మురళి, నాగరాజు, మోహన్, శ్రీను, మునేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

ఎంఈఓ బాబ్జీకి సత్కారం



ఎంఈఓ బాబ్జీని సత్కరిస్తున్న ఎమ్మార్సీ సిబ్బంది

పాకాల: స్థానిక ఎమ్మార్సీ కేంద్రంలో ఉత్తమ ఎంఈఓగా ప్రశంసాపత్రాన్ని పొందిన ఎంఈఓ బాబ్జీకి ఘనంగా సత్కరించారు. శనివారం ఎమ్మార్సీ సిబ్బంది ఎంఈఓకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలు సక్రమంగా విధులు నిర్వహిస్తున్నాయంటే అందులో ఎంఈఓ కృషి ఎనలేనిదని కొనియాడారు. విద్యార్థుల అభివృద్ధికి ఎంఈఓ చేస్తున్న కృషిని గుర్తించిన విద్యాశాఖ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఎంఈఓగా ప్రశంసాపత్రాన్ని అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటయ్య

చంద్రగిరి: ప్రవాస భారతీయుడు మల్లం మోహన్ ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య చికిత్సను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాయలపురం, పిచ్చినాయుడుపల్లి సర్పంచులు వెంకటయ్య, భాస్కర్ రెడ్డి కోరారు. శనివారం రెండోరోజు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శిబిరంలో అందిస్తున్న సేవలను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. విదేశాల్లో స్థిరపడినప్పటికీ సొంతూరుకు మేలు చేయాలనే ఉద్దేశంతో మల్లం మోహన్ ఇటువంటి గొప్ప కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం సంతోషదాయకమన్నారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కంటి వైద్యాధికారులు పరీక్షల అనంతరం అర్హులైన ప్రతిఒక్కరికీ ఉచితంగా చికిత్సను అందించడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. శనివారం సుమారు 160 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లం దీపిక రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, ఎంపీటీసీ నిరంజన్, ఉపసర్పంచ్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కోఆపరేటివ్ బ్రాంచ్ సందర్శన



బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ కామేశ్వరరావును సత్కరిస్తున్న బ్రాంచ్ ఉద్యోగులు, సభ్యులు

తిరుపతి కల్చరల్: తిరుపతికి విచ్చేసిన బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పి.కామేశ్వరరావు శనివారం మిట్టవీధిలో ఉన్న బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ బ్రాంచ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బ్రాంచ్ ఉద్యోగులను, జనరల్ బాడీ సభ్యులను కలిసి బ్రాంచ్ స్థితిగతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బ్రాహ్మణ కుటుంబీలకు ఆర్థికాభివృద్ధికి అందిస్తున్న సహకారం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్‌కి విచ్చేసిన కస్టమర్లతో, బ్రాంచ్ సిబ్బందితో ఆయన వివిధ రకాల తక్కువ వడ్డీ రుణ పథకాలు, డిపాజిట్లపై అత్యధిక వడ్డీ వంటి విషయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనను క్రెడిట్ సొసైటీ బ్రాంచ్ ఉద్యోగులు, సిబ్బంది, శాలువ, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులుఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంగమాంబ జీవితం స్ఫూర్తిదాయకం



వెంగమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముఖ్యఅతిథులు

తిరుపతి సిటీ: తరిగొండ వెంగమాంబ జీవితం యువతకు స్ఫూర్తిదాయకం, ఆదర్శనీయమని శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ సుబ్రమణ్యంరెడ్డి అన్నారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక, శ్రీవాణి, పద్మావతి మహిళా వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మహిళావర్సిటీ సావేరీ సెమినార్ హాల్‌లో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ భక్తి సాహిత్య స్వరాంజలి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ప్రధాన వక్తగా విచ్చేసి ప్రసంగించారు. ప్రతి విద్యార్థిని వెంగమాంబ జీవిత చరిత్రను చదవాలని పిలుపునిచ్చారు. 18వ శతాబ్దంలోనే తరిగొండ వెంగమాంబ ఒక ధీర వనితగా తన భక్తి తత్వాన్ని చాటిందన్నారు. ఆమె హేతువాద దృష్టితో మూఢ నమ్మకాలు, సమాజంలో స్త్రీలకు జరిగే అవమానాలపై ప్రశ్నించిన మహనీయురాలని కొనియాడారు. ఆమె సమాధి ప్రాంతాన్ని టీటీడీ అభివృద్ధి చేసి భక్తులకు అందుబాటులో ఉంచాలని కోరారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ మాజీ వీసీ ఆచార్య భూమన కుసుమకుమారి మాట్లాడుతూ విలువలు కోల్పోతున్న నేటి సమాజంలో ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో జరగాలని కోరారు. నాడు ఆమె చేసిన అన్నదానాలతోనే నేడు శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఆమె పేరు కొనసాగుతోందన్నారు. ద్రావిడ వర్సిటీ వీసీ ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ ఆమె జీవితం భక్తి, సాహిత్యం రెండింటిపై ఆధారపడి ఉంటుందన్నారు. అనంతరం ముఖ్యఅతిథులను శ్రీసిటీ, మహిళావర్సిటీ అధికారులు సన్మానించారు. అనంతరం వెంగమాంబ సాహిత్య పరిశోధకులు బసవ శంకరరావు, విద్యార్థులు ఆలపించిన కీర్తనలు వీక్షకులను అలరింపజేశాయి. మహిళా వర్సిటీ వీసీ భారతి, శ్రీ సిటీ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తదితరులు ప్రసంగించిన ఈ కార్యక్రమంలో ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ సాయికృష్ణ యాచేంద్ర, వై సుభాషిణి, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

తిరుపతి కల్చరల్: అఖిల భారత బ్రాహ్మణ కల్యాణ ాపాధ్యాయ వివాహ సమాచార కేంద్ర సంఘం, తిరుపతి అర్బన్ బ్రాహ్మణ సేవాసంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇస్కాన్ మందిరం ఎదురుగా ఉన్న శ్రీకంచి పాదుకా మండపంలో బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు సీఆర్‌కే.శేషగిరిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణ కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు పరిచయ వేదిక వద్ద స్పాట్ రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. వివాహ పరిచయ వేదికకు ముందు బ్రాహ్మణ వృద్ధులకు సామూహిక షష్టి పూర్తి, సహస్ర చంద్రదర్శనం, శాంతిహోమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్విమ్స్ పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీ ప్రదానం



డాక్టర్ ఈఎల్ చాముండేశ్వరి

తిరుపతి తుడా: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగంలో పరిశోధనలు నిర్వహించిన విద్యార్థిని డాక్టర్ ఈఎల్. చాముండేశ్వరి పీహెచ్‌డీని శనివారం ప్రదానం చేసినట్టు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వనజాక్షమ్మ తెలిపారు. స్విమ్స్ బయోటెక్నాలజీ విభాగం చీఫ్ గైడ్ ప్రొఫెసర్, విభాగాధిపతి డాక్టర్ పీవీజీకే శర్మ పర్యవేక్షణలో 'ఇన్ విట్రో జనరేషన్ ఆఫ్ కొండ్రోసైట్స్ ఫ్రమ్ హ్యూమన్ హెమటోపోయిటిక్ స్టెమ్ సెల్స్' అనే అంశంపై డాక్టర్ చాముండేశ్వరి శోధన పత్రాన్ని సమర్పించారు.

మహిళా సాధికారత ప్రతిబింబించేలా కూడళ్లు



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: మహిళా సాధికారత ప్రతిబింబించేలా నగరంలోని కూడళ్లను ఆధునీకరిస్తున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. మహిళా యూనివర్సిటీ కూడలి వద్ద ఏర్పాటు చేస్తున్న మహిళా సాధికారితకు నిలువుటద్దం పట్టేలా అన్ని రంగాల్లో రాణిస్తుండడాన్ని మహిళలు, విద్యార్థినుల ప్రతిమల అభివృద్ధి పనులను శనివారం కమిషనర్ పరిశీలించారు. అలానే ఫ్రీ లెఫ్ట్, సుందరీకరణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రప్రభుత్వం మహిళా సాధికారత కోసం కృషి చేస్తోందన్నారు. ఈ క్రమంలో ఆయా రంగాల్లో రాణిస్తున్న మహిళలు, విద్యార్థినుల ప్రతిమలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తద్వారా నేటి రతం యువతులకు ఈ ప్రతిమలు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఈ సందర్భంగా డీఈఈ మహేష్‌కు కమిషనర్ పలు సూచనలు చేశారు. త్వరగా ఫ్రీ లెఫ్ట్ పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. సర్కిల్ వద్ద చేపట్టిన సుందరీకరణ పనులను పరిశీలిస్తూ గ్రీనరీ పెంపునకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బైపాస్ రోడ్డుకు వెళ్లే ప్రధానమైన ఈ రహదారి కార్నర్, ఫ్రీ లెఫ్ట్ ఆవశ్యకతను గుర్తించి పనులకు ప్రాధాన్యత ఇచ్చినట్టు చెప్పారు. అతిత్వరలో ఈ కూడలిని ప్రారంభిస్తున్న నేపథ్యంలో పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

- 31న ఆస్పత్రి ప్రారంభం
- రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే చెవిరెడ్డి కృషి అమోఘం



మాట్లాడుతున్న ఎంపీపీ యుగంధర్‌రెడ్డి

భాకరాపేట : సంక్షేమం, అభివృద్ధికి జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేసిందని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి అన్నారు. శనివారం చిన్నగొట్టిగల్లు మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల కేంద్రమైన చిన్నగొట్టిగల్లులో రూ.7.25 కోట్లతో కార్పొరేట్‌కు దీటుగా ఆస్పత్రి నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. మెరుగైన వైద్యం ప్రజలకు అందించేందుకు జగనన్న ప్రభుత్వంలో అన్ని హంగులతో ఆస్పత్రి అందుబాటులోకి రావడం సంతోషించదగ్గ విషయం అన్నారు. అలాగే తుడా చైర్మన్‌గా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హయాంలో దాదాపు రూ.50 కోట్ల నిధులతో మండలంలోని 13 పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. జగనన్న సంక్షేమాభివృద్ధికి పెద్దపీట వేస్తే ఎమ్మెల్యే గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. ఇరువురు కృషి వల్ల మండలంలో సంక్షేమం, అభివృద్ధి గణనీయంగా ఉందన్నారు. శాఖల వారీగా సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయా శాఖలకు కేటాయించిన నిధులు, వాటి ద్వారా లబ్ధి పొందిన వివరాలను సమావేశంలో చర్చించారు. జెడ్పీటీసీ స్వరూప, ఎంపీడీఓ దేవేంద్రబాబు, తహసీల్దార్ లోకేశ్వరి, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

30న సమైక్యతా సమావేశం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జైభారత్ సంస్థ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: జైభారత్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన బాలాజీ కాలనీలోని అంబేద్కర్ భవన్‌లో హిందూ, ముస్లింల సమైక్యతా సమావేశం నిర్వహిస్తున్నట్లు జైభారత్ సంస్థ జాతీయ కార్యదర్శి లోకనాథ్ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన హిందూ, ముస్లింల సమైక్యతా సమావేశం పోస్టర్లను ఆవిష్కరించి ప్రసంగించారు. గతంలో వివేకానంద, నేతాజీ, గాంధీ, గఫర్‌ఖాన్, రామ్‌ప్రసాద్ బిస్మల్, అష్ఫాఖుల్లాఖాన్, ఉద్దమ్ సింగ్ వంటి మహనీయులు దేశ సాతంత్య్రం కోసం ఉద్యమించడంతో పాటు దేశవ్యాప్తంగా ఏటా డిసెంబర్ 19 నుంచి జనవరి 30వ తేదీ వరకు హిందూ–ముస్లిం సమైక్యతా దినాలుగా పాటించే దిశగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జైభారత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'మబ్బు'కు జీవిత సాఫల్య పురస్కారం



అవార్డులతో మబ్బు సూర్యనారాయణరెడ్డి

తిరుపతి కల్చరల్: హోటల్ రంగంలో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ హోటల్స్ అధినేత మబ్బు సూర్యనారాయణరెడ్డికి జీవిత సాఫల్య పురస్కారం లభించింది. ఈ మేరకు సౌత్ ఇండియా హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్యామ్‌రాజ్, ఉపాధ్యక్షుడు ఎం.బాలకృష్ణారెడ్డి చేతుల మీదుగా విశాఖలో ఆయన జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం ఓ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మబ్బు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ 1965లో కోనేటి కట్ట వద్ద విష్ణునివాసం, బంధువర్గంతో కలిసి లక్ష్మీనారాయణ భవన్ పేరిట హోటళ్లను స్థాపించి హోటల్ వ్యాపారం ప్రారంభించడం జరిగిందన్నారు. మబ్బు సూర్యనారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సామాజిక సేవలు అందిస్తూ తనవంతు సమాజహితం కోసం కృషి చేస్తున్నానని అన్నారు.

చేతిరాతపై ఉచిత శిక్షణ

పాకాల: స్థానిక ఎస్వీఎస్ పాఠశాల ఆవరణలో అందమైన చేతిరాతపై విద్యార్థులకు ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం గంగాధర నెల్లూరుకు చెందిన కెలియోగ్రాఫర్ 3 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ శిక్షణను అందిస్తున్నారు. సుమారు వారం రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఏమాత్రం తగ్గకుండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలో నైపుణ్యాలను పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఈఓ బాబ్జీ శిక్షణా తరగతులను పరిశీలించి, ఏకాగ్రతతో శిక్షణ పొందాలని విద్యార్థులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.మోహన్, పాఠశాల కమిటీ చైర్మన్ లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

16న తిరుచానూరులో రథసప్తమి

తిరుపతి(అలిపిరి): వచ్చే నెల 16వ తేదీన తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. రథసప్తమి పర్వదినం సందర్భంగా అమ్మవారు ఏడు వాహనాలపై ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 7.15 నుంచి 8.15 గంటల వరకు సూర్యప్రభ వాహనం, 8.45 నుంచి 9.45 గంటల వరకు హంస వాహనం, ఉదయం 10.15 నుంచి 11.15 గంటల వరకు అశ్వ వాహనం, ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు గరుడ వాహనంపై విహరించి భక్తులను కటాక్షించనున్నారు. మధ్యాహ్నం 1.15 నుంచి 2.15 గంటల వరకు చిన్నశేష వాహనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు చంద్రప్రభ వాహనం, రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు గజ వాహనంపై దర్శనమిస్తారన్నారు. సాయంత్రం 3.30 నుంచి 4.30 గంటల వరకు శ్రీకృష్ణస్వామివారి ముఖ మండపంలో అమ్మవారి స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు.



ఫొటోఫెయిర్ .. సూపర్

ఫొటోగ్రాఫర్లకు ఫొటోగ్రఫీలో కొత్త మెలకువలను అందుబాటులో తీసుకొచ్చేందుకు తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో శనివారం ఎగ్జిబిషన్‌ను తిరుపతి తిరుమల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రాజ్, కార్యదర్శి అమరనాథ్ ప్రారంభించారు. అనంతరం యువతులు క్యాట్‌వాక్ చేస్తూ అలరించారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

– తిరుచానూరు(చంద్రగిరి)

మద్యం విక్రేత అరెస్టు

తిరుచానూరు(చంద్రగిరి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని తిరుచానూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శివప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో పాటు నిందితుడి అరెస్టు చూపారు. ఆయన మాట్లాడుతూ ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు.. డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో తిరుచానూరు పోలీసుస్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపట్టుకు చెందిన మణికంఠ అనే వ్యక్తి తన ఇంటి సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు ఎస్ఐ చిరంజీవి సిబ్బందితో కలిసి దాడులు చేపట్టినట్లు తెలిపారు. అక్కడ మద్యం విక్రయిస్తున్న మణికంఠను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.